

**చెహోవ్ కథ**

# భర్త



సైనిక పటాలం రాత్రికి ఆ వూళ్లో ఆగింది. ఇక సందడికి కొదవేం లేదు. ఇంతమంది సైనికులు బస చేస్తున్నారని వినగానే ఊరి వాతావరణమే మారిపోయింది. గిరాకీలేక, ఈగలు తోలుకుంటూ కూర్చున్న చిల్లరకొట్లవాళ్లు అప్పటిదాకా అమ్ముడుపోని వస్తువులన్నీ దుమ్ము దులిపి రెట్టింపు ధరల కమ్ముకోవచ్చు. ఇక తిను బండారాల సంగతి చెప్పక్కర్లేదు. పాచివైనా, ముక్కవైనా కాస్త మసాలా చల్లి 'యిప్పుడే మీకోసం ఫ్రెష్‌గా చేశాం. అని అందించవచ్చు. అన్నింటికీ మించి మద్యం దుకాణాల జోరు. తెల్లారేలోగా పీపాలు పీపాలు ఖాళీ కావూ! టెంట్లు వేసుకుని, సివిలియన్ దుస్తుల్లో ఊరిమీద వడ్డారు సైనికులు. షోకులు చేసుకుని, సెంట్లు పూసుకుని ఆహ్వానాలు పలికిన అందగత్తెలకు కూడా తక్కువేమీ లేదు.

ఇంటి పనులన్నీ పక్కనపెట్టి స్త్రీలు సైనికులను చూడటానికి వీధిలో కొచ్చారు. ఒంటిమీద దుస్తులు సరిగా లేవు. జుత్తు చెదిరిపోయింది. సైనికుల బ్యాండు వినే తొందరలో వాళ్లు ఇవేమీ పట్టించుకోలేదు.

పటాలం వూళ్లో ఒక్క రాత్రే వుంటుందట. ప్చ్. గృహస్తులు ఎవరెవరు ఏయే సైనికులకు ఆతిథ్యమివ్వాలా అని చర్చించుకొంటున్నారు. ఆడవాళ్లకప్పుడే తమ యిళ్లకు వచ్చే అతిథుల జీవిత రహస్యాలన్నీ తెలిసిపోయాయి. కమాండర్‌కు పెళ్లైంది గాని భార్యతో కాపరం చెయ్యడం లేదుట. కెప్టెన్‌కు పిల్లలు పుట్టినా బతకలేదు. మరొక ఆఫీసరు ఒక ధనికురాల్ని ప్రేమించి విఫలమై ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడట. అందరి గురించీ సమాచారమైతే తెలిసింది గాని పరిచయం గాలేదు.

“ఈ రాత్రికి టౌనుహాల్లో డాన్సు ప్రోగ్రాం అరేంజి చెయ్యండి. అలాగైనా మేం వాళ్లని దగ్గరగా చూడొచ్చు” అదీ యువతుల డిమాండ్.

అలాగే రాత్రి ఎనిమిదింటికి డాన్సు ప్రారంభమవుతుంది. జీవితంలో అరుదుగా దొరికే ఇలాంటి అవకాశం వాళ్లను కలల లోకంలోకి తీసికెళ్లింది. తమ బాల్‌రూం డాన్సు పార్ట్‌నర్లని మనసులోనే ఎంపిక చేసుకున్నారు. దీపాలంకరణతో హాలు వెలిగిపోతున్నది. సమ్మోహనకరమైన సంగీతం మత్తెక్కిస్తున్నది. సైనికుల సాహచర్యంతో వున్న ఆనందం పూరి ఏడుపు మొహాల మగాళ్ల దగ్గిర ఎలా దొరుకుతుంది. తమ భర్తలు, తండ్రులు, బంధువులు అందరూ చిన్న వుద్యోగస్తులు. చిల్లర వ్యాపారస్తులు- అందర్నీ ఈ ఉత్సవరాత్రి మరచి సైనికులతో నాట్యం చెయ్య గలగటం ఒక అనుభవం! ఊరికొచ్చిన ఈ అతిథులతో పోల్చితే తమకంత గ్లామర్ లేదని పురుషులకూ తెలుసు.

ఇలాంటి అనేకమంది భర్తల్లో కిరిల్ షాలికోవ్ ఒకడు. చిన్న వుద్యోగి. అహంకారం, అసూయ నిండిన తాగుబోతు. హాలు తలుపు దగ్గిర నిల్చుని భార్యకేసి చూశాడు. భార్య అన్నా

**రష్యన్‌మూలం: చెహోవ్ .**
**తెలుగు గొంతు: కరుణారుణ**

మైమరచి నాట్యం చేస్తున్నది. ఏమిటా గెంతులూ! ముప్పై ఏళ్లు పైబడినా చిన్నపిల్లలా షోకు చేసుకుని వచ్చింది. ఆమెకు శరీరం అలసిపోయిందేమో గాని వుత్సాహం చావలేదు. కళ్లు మత్తుగా చూస్తున్నాయి. కోరికతో, ఆనందంతో బుగ్గలు ఎరుపెక్కాయి. తొలినాటి యవ్వనం జ్ఞాపకం వస్తున్నది కాబోలు- అందమైన రాకుమారుడు తనను వరించటానికి వస్తాడని కలలు గన్న రోజులు.

షాలికోవ్ మొహం కందగడ్డలాగైంది. అసూయలేదు గాని చికాకుగా వుంది. డాన్స్ ప్రోగ్రాంతో తమకు పేకాట ఆడుకోవటానికి స్థలం లేకుండా పోయింది. పైగా ఈ సైనికాఫీసర్లకు తమలాంటి సివిలియన్లంటే ఎగతాళి. ఇంకా... భార్య మొహం

సంతోషంతో అలా వెలిగిపోతున్నదేం! కొంప ముంచుతుందా ఏమిటిది!

నలభై ఏళ్లు దగ్గిరపడుతున్నాయి. ఈ వయసులో దీని మొహానికా పౌడర్లేమిటి? జుత్తు అలా అలంకరించుకోవటమేమిటి? ఆ విరగబడి నవ్వటమేమిటి? ఆ పరాచికాలు.. ఆ మూతి విరుపులు. ఛ.

భర్త తనవైపే చూస్తున్నాడన్న స్పృహ కూడా లేదు అన్నాకు.

మేమంతా పల్లెటూరి బైతులం. ఇదేమో అందాలరాణి! వయసు మీద పడ్డా యింకా దీని బింకం సడలలేదు. అందువల్ల వాళ్లకూ దీన్ని చూస్తే తిమ్మిరిగానే వుంటుంది. ఎవడైనా ఎగరేసుకుపోయినా దిక్కులేదు.

సన్నగా, పొడుగ్గా, నూనూగు మీసాల సైనికాఫీసర్లతో అన్నా అడుగులు కలిపి డాన్సు చేస్తున్నది. వెనక్కువాలి, కళ్లు సగం మూసుకుని వయ్యారాలు పోతున్న అన్నా. స్వప్న లోకాలలో తేలిపోతున్నది. ఈ నేలమీద, ఈ కుగ్రామంలో కాదు. మేఘాల బాటలో విహరిస్తున్నది. ఆ క్షణం ఆమె శరీరం ఒక ఆనంద బిందువు.

కళ్లు కమ్ముకుపోయిన దీని కాపరానికి అడ్డుకట్ట వెయ్యాలి. బతుకంటే కలలు కాదు. రాకుమారులు కాదు. బతుకంటే ఈ వూరు. భర్తంటే తను.

"పదహారేళ్ల పిల్లవు కాదే. ముసలి తొత్తువి. నీ సంగతి తేలుస్తానుండు." అనుకున్నాడు షాలికోవ్ పళ్లు కొరుకుతూ.

అసూయ, కోపం, దెబ్బతిన్న అహం, పై వాళ్లను చూస్తే పేరుకుపోయే ద్వేషం, తనెందుకూ చేతకాని వెధవనన్న నమ్మకం, తాగుబోతుతనం, అలసత్వం, అన్నీ కలిసి అతణ్ణి ఉసికొల్పాయి.

డాన్సుచేసి అలసిన అన్నా, తన పార్టనర్‌తో కూర్చుని, చిరు చెమటలు పట్టగా విసనకర్ర విసురుకుంది.

"చిన్నప్పుడు ఇంకా బాగా డాన్సు చేసే దాన్ని" అంటోంది గోముగా.

"ఇంటికెడదాం పద." అంటూ అరిచాడు షాలికోవ్ కోపాన్ని దాచుకుంటూ.

అన్నా వులిక్కిపడి చూసింది. సిగ్గుతో, అవమానంతో మొహం ముడుచుకుపోయింది. ఛీ. ఏం మనిషి!

"పద" భర్త గద్దించాడు.

"అప్పుడేనా? ఏం తొందర?"

"రమ్మంటున్నాను రా. అంతే." కోపంతో రొప్పుతున్నాడు.

"ఏమైంది? ఎందుకు రమ్మంటున్నావు?" అన్నా గొంతులో దైన్యం.

"ఏమీ కాలేదు. ఈ క్షణాన యింటికి వెళ్లిపోవాల్సిందే. బయల్దేరు. మాటలు పెంచక పద."

ఆమెకు మొగుడంటే అంత బెదురేమీ లేదు. కాని ఆఫీసర్ ముందర ఈ మనిషి అలా మాట్లాడడం అసహ్యంగా వుంది.

భర్తను కాస్త దూరంగా తీసికెళ్లి, గొంతు తగ్గించి, "నీకేమైందసలు? ఇంకా పదకొండన్నా కాలేదు. ఎందుకు రమ్మంటున్నావు?"

"ప్రశ్నలూ, జవాబులూ అనవసరం. పద. ఇప్పుడే. ఈ క్షణమే."

"నీకు పిచ్చెక్కినట్టుంది. ఉండలేకపోతే నువ్వెళ్లు, నేను తర్వాత వస్తాను."

"రావా? నిన్నొదిలిపెట్టేది లేదు. గోలచేస్తాను."

అవమానంతో, విచారంతో ఆమె మొహం వివర్ణమైంది. కళ్లల్లో నీళ్లు నిండుకున్నాయి. షాలికోవ్ మనసు ఆనందంతో, విజయగర్వంతో నిండిపోయింది.

> ***సన్నగా, పొడుగ్గా, నూనూగు మీసాల సైనికాఫీసర్లతో అన్నా అడుగులు కలిపి డాన్సు చేస్తున్నది. వెనక్కువాలి, కళ్లు సగం మూసుకుని వయ్యారాలు పోతున్న అన్నా. స్వప్న లోకాలలో తేలిపోతున్నది. ఈ నేలమీద, ఈ కుగ్రామంలో కాదు. మేఘాల బాటలో విహరిస్తున్నది. ఆ క్షణం ఆమె శరీరం ఒక ఆనంద బిందువు.***

"కొంపలో అంత అర్జంటు పనేం తగలడింది?" ఏడుపు గొంతుతో అడిగింది అన్నా.

"పనేమీ లేదు. నువ్వింటికి రావాలంతే. ఇది నా కోరిక. నా ఆజ్ఞ."

"మరొక్క అరగంట వుండనీ." అంటూ ప్రాధేయపడింది భార్య. మరి కాసేపు ఈ ఆనందం కొనసాగించడానికి ఆమె ఏమి చెయ్యడానికైనా సిద్ధపడింది. కాళ్లు పట్టుకుంటుంది. వేడుకుంటుంది. నవ్వుతుంది. ఏడుస్తుంది. తాము పోట్లాడుకుంటున్నామని యితర్లకు తెలియకూడదు. అరగంట కాదా! పోనీ పావుగంట. పదినిమిషాలు. అయిదు. ఆమె దైన్యం అతడికి ధైర్యమిచ్చింది. పట్టింపు మరింత పెరిగింది.

"వస్తావా? అందరిముందరా అరచి అల్లరి చెయ్యనా?"

ఆమెకు తన నిస్సహాయత తెలిసివచ్చింది. క్షణంలో వృద్ధాప్యం తనను కబళించినట్టుగా తోచింది. మొహం మీది చర్మం ముడతలు పడినట్టుంది.

"పద."

"అప్పుడేనా? ఏమైంది అన్నా?" అని అడుగుతున్నారు ఇతర డాన్సర్లు.

"తల నొప్పిగా వుందట" అని సర్ది చెబుతున్నాడు భర్త.

నిశ్శబ్దంగా యిద్దరూ ఇంటికి నడిచారు. కుంగి, ముడుచుకుపోయి, ఓటమి నంగీకరించి, చిన్న ఆనందాన్ని కూడా పొందలేని అంతులేని విచారంతో బరువుగా అడుగులేస్తున్న భార్యను చూస్తే షాలికోవ్‌కు తృప్తిగా, గర్వంగా వుంది. తనకు చికాకు తెప్పించిన, భార్య మొహంలోని ఆ ఉత్సాహం యిప్పుడు లేదు. చేతకానితనం. డాన్సు హాల్ కెళ్లి నవ్వుతూ, తుళ్లుతూ, కేరింతలు వేస్తున్న అందరి మొహాల్లోని చిరునవ్వునీ నలిపి వెయ్యగలిగితే ఎంత బావుంటుంది! చాలీ చాలని ఆదాయాలతో, ఎదుగుబొదుగులేని బతుకులీడుస్తున్న ఈ చవటలు, బురద గుంటల్లాంటి యిళ్లల్లో కుళ్లి కంపుకొడుతున్న ఈ మనుషులు వీళ్లకు ఒక్కనాటి ఆనందం కావాలా?

రాత్రి నిషా కాదు. తెల్లారి లేచి తెలుసుకోండి. మీ బతుకుల నిస్తబ్దత. ఇలాంటి మనుషుల జీవితాల్లో సరదా డాన్సు కాదు. సారా. పేకాట మాత్రమే.

అన్నాకు కాళ్లు తడబడుతున్నాయి. డాన్సు. సంగీతం. లైట్లు. కొద్దిసేపటి క్రితం తనను స్వప్నలోకాలలో విహరింపజేసిన ఆ అద్భుత అనుభవం. తనేం పాపం చేసింది. దేవుడు తనకెందుకీ శిక్ష విధించాడు? తన ఆనందాన్ని నలిపివేసిన మృత్యుదూత. ఈ భర్త రూపంలో వచ్చాడు. ఎలాగ తిట్టి, ఏమి చేసి భర్తమీద ప్రతీకారం తీర్చుకోగలదు? ఇలాంటి మనిషి తిట్లకూ, శాపనార్థాలకూ అతీతుడు. ఆగర్భ శత్రువు, నరరూప రాక్షసుడు అంటూ ఎవడైనా వుంటే వాడు కూడా తన భర్త అంత దుర్మార్గుడు కాడు.

దూరం నుండి సంగీతం అలలు అలలుగా వినిపిస్తూనే వుంది. టౌనుహాలు వెలుగుల కాంతి తగ్గలేదు. ■